క్లుప్తంగా

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

పిఠాపురం: పాఠశాలల్లో బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీవైఈఓ సుభద్ర తెలిపారు. పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు దుర్గారావు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై ఆమె శనివారం విచారణ చేపట్టారు. బాలిక తల్లి ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు.

రుచి సోయా ఫ్యాక్టరీ వద్ద ధర్నా



నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఫ్యాక్టరీ అధికారులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రుచి సోయా ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద వేట్లపాలెం గ్రామస్తులు శనివారం నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ జలాలు గ్రామంలోకి వస్తున్నాయని, దీని కారణంగా తాగునీరు కలుషితమవుతుందని ఆరోపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి కాలుష్య జలాల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరాహార దీక్ష చేస్తున్నవారికి ఫ్యాక్టరీ అధికారులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

నిల్వ ఉన్న స్వీట్ల విక్రయాలు

కొత్తపల్లి: మండలంలో ఉన్న పలు స్వీట్ స్టాళ్లలో నిల్వ ఉన్న స్వీట్లను వ్యాపారులు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఊరచెరువు సెంటర్‌లో ఉన్న రామ్‌దేవ్ స్వీట్స్‌స్టాల్‌లో కొనగోలు చేసిన పదార్థాలు దుర్వాసన వస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇటువంటి విక్రయాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు జ్ఞాపికల బహూకరణ



ఉపాధ్యాయులను జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలికలు, బాలుర పాఠశాలలో మనభూమి–మనదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు విశ్రాంత ఉపాధ్యాయుడు సీసీఆర్ ప్రసాద్, మచ్చకంటి చలపతిరావు ఆధ్వర్యంలో శనివారం జ్ఞాపికలు అందజేశారు. చలపతిరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు మన మాతృభూమి–మనదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. హెచ్ఎం సీహెచ్‌వీ రమణమూర్తి, కేఎస్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో ఉన్న ప్రకాశ్‌నగర్‌లో సీసీ రోడ్లకు జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ నిధులు రూ.2లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.1లక్షతో ఈ రహదారులు నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయల, వసతులకు పెద్ద పీట వేసింది. జెడ్పీటీసీని, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్‌లను ఎంపీటీసీ గోగు లోవకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు గోగు జగన్నాథం సత్కరించారు. అమరవల్లి సర్పంచి పులి జయబాబు, మేరుగు అప్పారావు, సీహెచ్ అర్జున్, వడిగే కనకేశ్వరరావు, కాకాడ శ్రీను, మల్లేపల్లి ఏసేబు తదితరులు ఉన్నారు.

నూకాలమ్మ ఆలయం వద్ద అన్నదానం



అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట గ్రామంలో నూకాలమ్మ ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన భారీ అన్నసంతర్పణను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. తొలుత ఆయన నూకాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు మితం... పోషణ అమితం

- చిరుధాన్యాలతో పౌష్టికాహారం
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు

పెద్దాపురం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటేనే ఎవరికైనా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. తద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరిగి రోగాలకు దూరంగా ఉండవచ్చు. సాధారణంగా ఖరీదైన పదార్థాల్లోనే పోషక విలువలుంటాయని భావిస్తుంటారు. కాని మన ఇంట్లో ఉన్న పదార్థాలతోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలతో వివిధ పదార్థాలను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు.

పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో

పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పెద్దాపురం, అర్బన్ ప్రాజెక్టు, సామర్లకోట అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలో 283 అంగన్‌వాడీ కేంద్రాలు, 6 మినీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు 1552 మంది, బాలింతలు 1387 మంది, ఆరు నెలల నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు 7,397 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకూ 5,033 మంది పిల్లలు ఉన్నారు.

పోషకాలు అధికం

రాగులు, జొన్నలు, కొర్రలు, గోధుమ తదితర చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా మనకు సంపూర్ణ పోషణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆకుకూరలు, కూరగాయాల ద్వారా విటమిన్లు అందుతాయి. గర్భిణులు, బాలింతలు ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ శిబిరాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిరు ధాన్యాలతో తయారు చేసుకునే పదార్థాలను ప్రదర్శిస్తున్నారు. తద్వారా అక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ స్టాల్

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోంది. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– గోపు మురళి, ఉప సర్పంచ్, తాటిపర్తి, పెద్దాపురం మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్నాం. బాలామృతం, రాగి పిండి, కందిపప్పు, బియ్యం, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం, మంచినూనె, గుడ్లు, పాలు అందిస్తున్నాం. నెలలో ప్రతీ మొదటి, మూడో శుక్రవారాల్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. సురక్ష శిబిరాల్లో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

– జి.ఉష, సీడీపీఓ, ఐసీడీఎస్, ప్రాజెక్టు, పెద్దాపురం

ఎమ్మెల్యే దొరబాబుకు సత్కారం



ఎమ్మెల్యే దొరబాబును సత్కరిస్తున్న నాయకులు

పిఠాపురం: రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యే పెండెం దొరబాబును శనివారం పలువురు వైఎస్సార్ సీపీ నేతలు సత్కరించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఆయనను సత్కరించారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జీ, జేసీఎస్ కన్వీనర్ మొగలి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతు ఎమ్మెల్యే దొరబాబు మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దాపురం: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆర్‌బీ కొత్తూరులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన టి.ప్రసాద్(25) మోటారు సైకిల్‌పై ఆర్‌బీ కొత్తూరు వచ్చి మద్యం తాగాడు. అనంతరం అక్కడున్న చెట్టు కొమ్మకు ఉరేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

టిడ్కో ఇళ్ల స్వాధీనం



మున్సిపల్ అధికారులకు టిడ్కో ఇళ్ల గురించి వివరిస్తున్న డీఈ రాజు

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలోని ఆరు బ్లాక్‌లలో నిర్మించిన 416 టిడ్కో ఇళ్లను శనివారం టిడ్కో అధికారులు మున్సిపల్ అధికారులకు స్వాధీనం చేశారు. ఇళ్లను పరిశీలించి తాళాలు వేసుకోవాలని టిడ్కో డీఈ రాజు అధికారులను కోరారు. లబ్ధిదారులకు అప్పగించాక రెండు నెలల వరకూ ఇళ్లకు సంబంధించిన అవసరాలను తీరుస్తామన్నారు. టిడ్కో లబ్ధిదారులందరికీ ఇళ్ల అప్పగింతపై సమాచారం తెలియజేయాలని మెప్మా సిటీ మేనేజర్ సుజాతను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆదేశించారు. అయితే పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం వద్ద టిడ్కో ఇళ్ల కోసం అనేక మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని సుజాత ప్రస్తావించారు. అక్కడి ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించిన తరువాత స్వాధీనం చేస్తామని టిడ్కో డీఈ బదులిచ్చారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో శనివారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిచ్చి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం వైద్య సేవలపై ఆరా తీసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, నల్లల గోవిందు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీ నల్లల సూర్య కుమారి, మండల కో–ఆప్షన్ సభ్యులు శేషకుమారి, వ్యవసాయ కమిటీ సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, పెంటా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే నూతన అధ్యాయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం జి.మేడపాడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ఆరోగ్య సురక్ష క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని దొరబాబు పిలుపునిచ్చారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమానికి ఎంపీడీఓ డి.శ్రీలలిత, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు మోరంపూడి శ్రీరంగనాయకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, సర్పంచ్ పటాని దేవి, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కట్టమూరులో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చైర్మన్ దొరబాబు

సీఎం సభను విజయవంతం చేద్దాం

పెద్దాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ పర్యటనకు ఎప్పుడొచ్చినా భారీ జనసమీకరణతో విజయవంతం చేద్దామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఈ నెలలో సామర్లకోటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శనివారం స్థానిక వెలమ సంఘం కల్యాణ మండపంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన పట్టణ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న సామర్లకోటలో పర్యటించి బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, సచివాలయ మండల కన్వీనర్ గోపు మురళి, కమిషనర్ జంపా సురేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళ వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పవర్ పునరుద్ధరణ

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం మేజర్ పంచాయతీ సర్పంచ్ సీహెచ్ వెంకటలక్ష్మి చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీఓ డి.శ్రీలలిత శనివారం తెలిపారు. ఇటీవల సర్పంచ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు చెక్ పవర్‌ను రద్దు చేసి ఎంపీడీఓకు చెక్‌పవర్ అధికారం ఇచ్చారు. అయితే సర్పంచ్ కోర్టును ఆశ్రయించడంతో కోర్టు సూచనల మేరకు జిల్లా పంచాయతీ అధికారి బ్యాంకు నుంచి లావాదేవీలు జరుపుకునేలా హక్కు కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారన్నారు.

సమస్యలు లేని గ్రామాలు తయారుచేయాలి



పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులు సమస్యలు లేని గ్రామాలను తయారుచేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల పరిధిలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–6 వరకూ పంచాయతీ కార్యదర్శుల సమీక్షలో ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పారిశుధ్యం, తాగు నీరు, వీధి దీపాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి మణిమాల పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికే ఆరోగ్య సురక్ష

జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్



శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తులసీకుమార్

కొత్తపల్లి: నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ఏర్పాటు చేసి నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ నక్కా మణికంఠ బాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 419 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మౌనిక, సుష్మ తెలిపారు. మణికంఠబాబు మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య ఉన్నప్పుడే రాష్ట్రం సుసంపన్నంగా ఉంటుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులు కల్పించారని అన్నారు. ప్రతి ఇంటికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారని తెలిపారు. వైద్య శిబిరంలో ఎవరికైనా శస్త్రచికిత్స చేయాలని నిర్ధారిస్తే వైద్యులు చికిత్స అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం పరీక్షలు చేయించుకుంటున్న వారిని పరామర్శించి వివరాలు అడిగితెలుకున్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీడీఓ పి.వెంకటనారాయణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్, సచివాలయం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

అనారోగ్య సమస్యలు తలెత్తకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని సర్పంచి నక్కా మణికంఠబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అమీనాబాదులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం న్యూట్రిషన్ స్టాల్‌ను ఎంపీడీఓ పి.వెంకటనారాయణతో కలసి పరిశీలించారు. శిబిరానికి హాజరైన గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐ పొన్నాల, ఇంచార్జి ఈఓ పీఆర్డీ శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పురుహూతికా పీఠంలో దసరా సందడి

- నవరాత్ర మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దొరబాబు




దసరా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు

పిఠాపురం: ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం దసరా ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. పదో శక్తిపీఠమైన ఈ క్షేత్రంలో అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పది రోజుల పాటు ఎంత మంది భక్తులు వచ్చినా ఏ ఇబ్బందీ లేకుండా వసతులు కల్పిస్తున్నట్టు దొరబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ వి.శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు భక్తులు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఈ సందర్భంగా నిత్యం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు అమ్మవారిని వివిధ అవతారాలలో అలంకరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆయా అవతారాలకు తగ్గట్టుగా ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల పుణ్య స్నానాలకు పాదగయ పుష్కరిణిని సిద్ధం చేశామని, భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వయంగా వచ్చే భక్తులతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండి ఇక్కడకు రాలేని భక్తుల కోసం తమ గోత్రనామాలతో పూజలు చేయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. దసరా పది రోజులు రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి పోస్టు ద్వారా ప్రసాదాలు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు. అలా పోస్టు ద్వారా ప్రసాదాలు కావాలనుకున్న వారు రూ.500 చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుందన్నారు. అలాగే కార్తికమాసంలో నెల రోజుల పాటు కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేసి పోస్టు ద్వారా ప్రసాదాలు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు. అలా పోస్టు ద్వారా ప్రసాదాలు కావాలనుకున్న వారు రూ.1000 చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

సామర్లకోట: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం యు.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఇటీవల కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో అండర్–14 బాలుర విభాగం నుంచి ఎస్.చిన్నకేశవ, అండర్–17 బాలికల విభాగం నుంచి పి.మానసలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పాదగయ క్షేత్రంలో భవానీల సందడి



పురుహూతికా క్షేత్రంలో భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

పిఠాపురం: ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దీక్షలు స్వీకరించే భవానీ భక్తుల సందడి ప్రారంభమైంది. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భవానీ మాల ధరించడానికి భారీగా భక్తులు తరలి వస్తుండడంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీరాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాలలో పదోశక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారి వద్ద భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు మాల ధారణలు చేయిస్తున్నారు. వారం రోజుల నుంచి పాదగయ క్షేత్రంతో పాటు ఇతర దేవాలయాల్లోను ప్రతీ రోజు వందల మంది భవానీ దీక్షలు చేపడుతున్నారు. ఒక్క పాదగయ క్షేత్రంలోనే 10 రోజుల్లో 15వేల మందికి పైగా దీక్షలు స్వీకరించారు. కొంత మంది 41 రోజులు, కొంత మంది 21 రోజులు, 9 రోజులు దీక్షలు చేపడుతున్నారు.

సంక్షేమానికి మారు పేరు జగన్

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి మారు పేరుగా మారారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలులో ఒక కల్యాణ మండపంలో శనివారం నగర పంచాయతీ, మండలం వైఎస్సార్ సీపీ నేతలకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగన్ కావాలి అనే కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిస్తున్నందుకు ఆయనే రాష్ట్రానికి సీఎం కావాలని జనం అడుగుతున్నారన్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజలందరినీ కలుసుకుని ఇంకా మిగిలి ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని కూడా పరిష్కరించామని ఆయన తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తూచ తప్పకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల వివరాలను ప్రజలకు తెలియజేసి వారికి రాష్ట్రానికి ఎందుకు జగన్ కావాలి అనే విషయాన్ని వివరించాలని నాయకులకు, కార్యకర్తలకు, వలంటీర్లకు సూచించారు. అన్నీ చేసి చూపించాం కాబట్టి ప్రజల దగ్గరకు వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీ నేతలకే ఉందన్నారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగలి బాబ్జీ, జేసీజెస్ కన్వీనర్ మొగలి సాంబశివరావు, సొసైటీ ప్రెసిడెంట్ జ్యోతుల భీముడు, గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మైనం రాజా, రామయ్యదొర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

సూక్ష్మ సంస్థలు అభివృద్ధి చెందాలి

డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి

సామర్లకోట: ఆహార పరిశ్రమ రంగంలో మహిళా సంఘాల ద్వారా సూక్ష్మ సంస్థలు అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక టీటీడీలో ఏర్పాటుచేసిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకుంటున్న రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ)ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో ప్రతి యూనిట్‌కు 35 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. బ్యాంకుల నుంచి మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకూ రుణాలిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొన్ని మండలాల్లో మండల సమాఖ్యల పనితీరు అసంతృప్తిగా ఉందని ఆమె చెప్పారు. కాకినాడ జిల్లా మహిళా సమాఖ్య రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా మహిళా సమాఖ్య పనితీరుపై ఇక నుంచి ప్రతీ నెల సమీక్ష చేస్తామని సెర్ప్ ప్రత్యేకాధికారి డి.రత్నాకర్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథకం డీపీఎంలు బాబురావు, కేశవ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డి.సంధ్యారాణి, కార్యదర్శి కె.గంగతల్లి, ఉపాధ్యక్షురాలు వి.కాంచన తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామివారికి రూ.3,51,687 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

GENERAL PUBLICATION

FINANCE LIMITED, Registered Office at Chennai and Branch Office, Samalkot. We issue this notice to the General Public.

Smt. BIKKINA VEERAVENI, W/o. Veera Venkata Satyanarayana

SCHEDULE :

ITEM NO. 1:

ITEM NO. 2:

C.S.M.N. SWAMY, ... C.A.S.S. JYOTHI, ...

Advocates 16-24-6, BT-1, Gandhi Nagar, KAKINADA - 4.